క్లుప్తంగా

విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోనూ, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

వినియోగంలోకి తేవాలి

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఈఓఆర్డీ నాగేంద్రయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాల షెడ్లను పరిశీలించారు. నెహ్రూనగర్ షెడ్డును వర్మీకం పోస్టుతో నింపితే వానపాములను వదులుతామన్నారు. కొత్త ముచ్చుమర్రిలో నిర్మించిన షెడ్డుకు రహదారి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కాశీంకు సూచించారు. షెడ్డు లోపల తొట్లకు బీటలు వారాయని, వాటిని చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ శాఖ మండల ఇంజినీర్ జావేద్ ఉన్నారు.

పరామర్శ



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొరెడ్డి కృష్ణారెడ్డి (82) మృతి చెందారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కూడా ఫోన్‌లో కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేపు మార్కెట్ వేలం పాటలు

నందికొట్కూరు: ఈనెల 15న జైకిసాన్ పార్కులో మార్కెట్ వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025–26కు సంబంధించిన మున్సిపాలిటీ పరిధిలోని వారపు సంత, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఫీజు, జంతువధ శాల, మాంసం మార్కెట్ వేలం పాటలు ఉంటాయన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పాములపాడు: పైపు లైన్‌కు మరమ్మతులు, నూతన పైపులైన్ నిర్మాణంతో ప్రజలకు తాగునీటి పరిష్కరామైందని సర్పంచు నాయిని సావిత్రమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ మజారా కోల్స్ ఆనందాపురం గ్రామంలో పంచాయతీ, ఎంపీపీ నిధులతో పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్, చర్చీ వద్ద 4 కుళాయిలతో కూడిన దిమ్మెలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు కల్లూరి పెద్ద మస్తానయ్య, ఉప సభాధ్యక్షులు బేతం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవ్స్, కరువు భత్యం, బకాయిలు త్వరగా చెల్లించాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడదామన్నారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఈడిగ వెంకటరమణ, పి.గుర్రప్ప, సహ కార్యదర్శి ఎం.జనార్దన్‌రావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వెలుగోడు: సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. బుధవారం బోయరేవుల గ్రామ సమీపంలోని పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన పంటలు పండించాలన్నారు. పురుగు మందు అవశేషాలు లేని పంటలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

మిడుతూరు: వ్యవసాయంలో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ విజయశేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని దేవనూరు, చింతలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వవ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్ పాల్గొన్నారు.

ప్యాచ్‌లు లేచిపాయె!

- వేసిన మూడురోజులకే మళ్లీ దెబ్బతిన్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రోడ్లపై వేసిన ప్యాచ్‌లు కాంట్రాక్టర్ల కక్కుర్తికి మూన్నాళ్ల ముచ్చటవుతున్నాయి. నిధులను దిగమింగి నాణ్యతను గాలికొదలడంతో ఏళ్లపాటు ఉండాల్సిన రహదారుల రెండుమూడు రోజులకు కంకర తేలి గుంతలమయమవుతున్నాయి. ఆత్మకూరు నుంచి కొత్తపల్లి ప్రధాన రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డుపై గుంతుల పడ్డాయి. వాటికి పాచ్ వర్క్ నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కక్కుర్తి పడ్డారు. కంకరలో తారు



నందికుంట గ్రామం వద్ద నాసిరకంగా వేయడంతో మరోసారి దెబ్బతిన్న రహదారి

తూతూ మంత్రంగా వేసి గుంతలు పూడ్చగా అవి మూడు రోజులకే లేచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఒక పక్క నవ్వుకుంటుండగా.. మరో పక్క దుమ్మెత్తి పోస్తున్నారు.

– కొత్తపల్లి



నందికుంట - బావాపురం గ్రామాల మధ్య రహదారిలో నాణ్యత లేకుండా వేసిన ప్యాచ్‌లు

అజీజ్ హాబీ.. కరెన్సీ సేకరణ

- 30 ఏళ్ల నుంచి 45 దేశాల కరెన్సీ సేకరణ

పట్టణానికి చెందిన కొలిమి అజీజ్‌మహబూబ్ కరెన్సీ, నాణెల సేకరణ హాబీగా పెట్టుకున్నాడు. స్వదేశీతో పాటు విదేశాల కరెన్సీని సేకరిస్తున్నాడు. ఇప్పటికే ఆయన వద్ద 45 దేశాల కరెన్సీ ఉంది. ఇక భారతదేశానికి సంబంధించి 1904 నుంచి ఇప్పటి వరకు రూపాయి నాణెం, అణా, దమ్మిడి, పైసా, రెండు పైసలుతో పాటు వివిధ రకాల నోట్లు ఉన్నాయి.

– ఆత్మకూరు



భారతదేశానికి చెందిన నాణేలు



విదేశీ కరెన్సీతో ఆత్మకూరుకు చెందిన కొలిమి అజీజ్‌మహబూబ్



వివిధ దేశాలకు చెందిన కరెన్సీ

కరెన్సీ ఇదే..

అజీజ్‌మహబూబ్ దేశంలోని పాత, కొత్త నోట్లకు చెందిన రూపాయి, రెండు రూపాయిలు, రూ.5, రూ.10, రూ.20, రూ.500, రూ.200, రూ.2 వేల నోట్లతో పాటు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, నార్త్‌కొరియా, హితోపియా, ఖజకిస్తాన్, కాంగో, సౌతాఫ్రికా, సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, హాంకాంగ్, ఉమాన్, కంబోడియా, ఉక్రెయిన్, అమెరికా, సింగపూర్, కెన్యా, కువైట్, జర్మనీ, ఫ్రాన్స్, నార్త్‌వే, బెల్జియం, కెన్యా తదితర దేశాలతో పాటు మరిన్ని దేశాలకు చెందిన రకరకాల విదేశీ నోట్లను సేకరించాడు. దాదాపు ఇతను కరెన్సీ సేకరణకు రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చు చేసి వీటిని సేకరించాడు.

వివిధ నాణేలు

మనదేశంలో 1904 నుంచి తయారైన నాణేలను అజీజ్‌మహబూబ్ సేకరించడమేగాకుండా నోట్లను కూడా సేకరించి తన వద్ద భద్రపరుచుకున్నారు. హైదరాబాద్ నవాబ్ పరిపాలనలో కొనసాగిన వెండి, రాగి నాణేలు సేకరించుకుని దాదాపు 120 ఏళ్ల కరెన్సీ, నోట్లను తన వద్ద ఉంచుకున్నారు. అతి పురాతనంలో ఎవరూ చూడని, అణా, దమ్మిడి, హైదరాబాద్ నవాబు నాణేలతోపాటు అర్ధపైసా, పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, పావలా, అర్ధ రూపాయి, రూపాయి, రెండు రూపాయిలు, ఐదు రూపాయలు, పది రూపాయలు లాంటి ఎన్నో నాణేలను సేకరించగా, పురాతన నోట్లు సైతం రూపాయి, రెండు రూపాయలు, పాత నోట్లు రూ.50, రూ.100, రూ.500 సైతం తన వద్ద దాచుకున్నాడు.

అనుకున్న లక్ష్యం సాధించా

ప్రతి మనిషి ఏదో ఒక లక్ష్యాన్ని సాధించి విజయం లక్ష్యంగా ముందుకు సాగుతారు. నేను ఆత్మకూరులోనే ఉంటూ విదేశీలకు చెందిన కరెన్సీని మనదేశంలోని వివిధ కరెన్సీ, తాను పుట్టినప్పటి నుంచి ఉన్న వివిధ నాణేలను సేకరించాలని లక్ష్యంగా ఎంచుకుని నాణేల సేకరణ చేపట్టాను. 40 దేశాల కరెన్సీని పోగు చేసి మనదేశానికి చెందిన నాణేలు, నోట్లను భద్ర పరుచుకుని ముందుకు సాగుతున్నాను. అన్ని నోట్లను తన వద్దే ఉంచుకున్నాను. ఏదో సాధించాలన్న తపనతో ఇలా నోట్లవైపు తన మనస్సు వెళ్లడంతో అనుకున్నవిధంగా కరెన్సీ నాణేల సేకరణ సాగిస్తున్నాను. ఇప్పుడు ఈ సేకరణతో సంతృప్తి చెందుతున్నాను.

– కొలిమి అజీజ్‌మహబూబ్, ఆత్మకూరు

మద్ది గుండం చెరువు రైతుల సమస్యను పరిష్కరిస్తాం

- ఆర్డీఓ నాగజ్యోతి

మిడుతూరు: మద్దిగుండం చెరువు రైతుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని, ఇరు గ్రామాల రైతులు సంయమనం పాటించాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, డీఎస్పీ రామంజినాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జలకనూరు మద్దిగుండం చెరువు కింద సాగు చేపడుతున్న జలకనూరు, సుంకేసుల గ్రామాలకు చెందిన రైతులతో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెరువు కింద సాగు చేపడుతున్న జలకనూరు, సుంకేసుల గ్రామాల రైతులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. తమ చెరువుకు అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసుకొని సుంకేసుల గ్రామానికి చెందిన రైతులు నీటి చౌర్యానికి పాల్పడుతుండటంతో తమ పొలాలు ఎండిపోతున్నాయని జలకనూరు రైతులు ఆరోపించారు. 15 ఏళ్ల నుంచి మోటార్ల ద్వారా పంటల సాగుకు నీటిని వాడుకుంటున్నామని ఇప్పుడేమీ కొత్తకాదని సుంకేసుల గ్రామస్తులు ఆర్డీఓకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వినతుల రూపంలో ఇస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఇరు గ్రామాల ప్రజలకు చెప్పారు. అంతవరకు సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ జయశంకర్, డీఈ శ్రీనివాసులు ఎంపీడీఓ దశరథరామయ్య, ఏఈ క్రాంతికుమార్, ఏఓ పీరునాయక్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

బాలిక అదృశ్యం

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తండ్రి పుల్లయ్య తెలిసిన చోటల్లా గాలించాడు. ఆచూకీ లభించకపోవడంతో బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్ను ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121101191 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అలవరుచుకోవాలి

- డీఎస్పీ రామంజినాయక్

మిడుతూరు: నైతిక విలువలతో కూడిన విద్యను అలవరచుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులతో బాడ్ టచ్, గుడ్ టచ్, నేర ప్రవృత్తి, బాల్య వివాహాలు, నైతిక విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాల్యం నుంచి పిల్లల నడవడిక, ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. గుడ్ టచ్ బాడ్ టచ్ పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఆకతాయిలపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి హేయిర్ కటింగ్, డ్రస్ కోడ్ సక్రమంగా ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల ఏలా మెలగాలని అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. నేటి యువత చెడు వ్యసనాలకు లోను కావొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ ఓబులేసు, , ప్రిన్సిపల్ సలీంబాషా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బారతాల పౌర్ణమి వేడుకలు



ఆత్మకూరులో పూజలు అందుకున్న జంబులాదేవి



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: బారతాల పౌర్ణమి వేడుకలను మండల వ్యాప్తంగా బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జంబులమ్మదేవి ఆలయంతోపాటు వివిధ గ్రామాల్లో పోలేరమ్మ, సుంకులమ్మ, చౌడేశ్వరి తదితక గ్రామదేవతలకు పౌర్ణమి సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

నందికొట్కూరు: భారతాల పున్నమి వేడుకలను చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని భక్తులు అలకరించారు. ఉత్సవ విగ్రహముతో పంచముఖి వినాయకుడి ఆలయం వరకు చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పున్నమి పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లో బుధవారం భారతాల పున్నమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ దేవత జంబులా పరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఏడాదంతా చల్లంగా చూడాలని పాడిపంటలతో వర్ధిల్లాలని భక్తులు ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు.



నెహ్రూనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

23 యూనిట్లు..204 దరఖాస్తులు

పగిడ్యాల: వెనుకబడిన తరగతుల(బీసీ) నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ కింద మండలానికి 23 యూనిట్లు మంజూరు కాగా 204 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రాతకోట, కొణిదేల, పగిడ్యాల బ్యాంక్ పరిధిలోని నిరుద్యోగ యువతీయువకుల కోసం 23 యూనిట్లు బీసీ కార్పొరేషన్ మంజూరు చేసిందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం వరకు సమయం ఉన్నందున 204 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి కార్యాలయానికి అర్జీలను సమర్పించినట్లు ఆమె వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులను బ్యాంకర్లు ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

కొత్త ముచ్చుమర్రిలో ఆర్డీఓ విచారణ

పగిడ్యాల: మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రిలో ఆర్డీఓ నాగజ్యోతి బుధవారం విచారణ చేపట్టారు. ఎల్‌పీఎం నంబర్ 2111లో గల రెండు ఎకరాల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి గత నెల 30వ తేదిన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అందువల్ల భౌతికంగా పరిశీలన చేయడానికి ఆర్డీఓ వచ్చినట్లు తహసీల్దార్ శివరాముడు పేర్కొన్నారు.



ల్యాండ్ కన్వర్షన్ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

నేడు బీరవోలులో అవార్డు కాపీలపై విచారణ

శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయి పరిహారం అందక కోర్టును ఆశ్రయించిన అవార్డుదారులను విచారించేందుకు గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్ అధికారులు వస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. నేటి నుంచి మండల వ్యాప్తంగా ఈనెల 17వ తేది వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 13న బీరవోలు, 14న మూర్వకొండ, వీరాపురం, 15న ముచ్చుమర్రి, ఎల్లాల, పాలమర్రి, 17న ప్రాతకోట గ్రామాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నందున అవార్డుదారులు ఈ సదస్సులకు తప్పనిసరిగా హాజరు కావలని తహసీల్దార్ కోరారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో, గ్రామ సర్వేయర్ ఉన్నారు.

పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండండి

కొత్తపల్లి: మినుమును సాగుచేసే రైతులు పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని నందికుంట గ్రామశివారుల్లోని మినుము పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుమును తెల్లదోమ ఆశించడం ద్వారా పల్లాకు తెగులు సోకుతుందన్నారు. దీనిని నివారించేందుకు తెల్లదోమ కనపడిన వెంటనే పురుగు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. విత్తనం వేసిన 15 నుంచి 20 రోజులకోసారి వేపనూనె 5 మి.లీటర్లకు ఒక లీటరు నీటికి కలిపి, 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు.



రైతులకు సలహాలిస్తున్న ఏఓ మహేష్

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

ఆత్మకూరు: సమ్మెకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పెద్ద నాగరాజు, తిమ్మయ్య, గొడుగు రాజు, సువర్ణమ్మలు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట 2వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రిలే నిరాహార దీక్షకు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వీరన్న, మాబాషా తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ఎంపీడీఓ మేరీ, ఐఎఫ్‌సీ క్లస్టర్ డీపీఎం సురేష్ సూచించారు. స్థానిక వెలుగు సమావేశ భవనంలో వెలుగు ఏపీఎం పుల్లయ్య ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ కన్వర్జెన్సీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాలయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. సమీకృత వ్యవసాయం, అంతర్ పంటలు, రసాయనిక ఎరువుల వాడకం గురించి వివరించారు. పశువులకు టీకాలు అవసరమైతే సంబంధిత పశువైద్యశాలను సంప్రదించాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా రైతులకు కలిగే ఆర్థిక ఆదాయంపై రైతులకు వివరించారు. హర్టికల్చర్ ద్వారా వేసుకున్న పంటలకు 100 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ మహేష్, పశువైద్యాధికారి భువనేశ్వరి పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష కుంకుమార్చన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపించారు. భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, తదితర ప్రాంతాల నుంచి పూజలను నిర్వహించుకున్నారు. లక్ష ముందుగా పూజా సంకల్పం పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ, అనంతరం లక్ష కుంకుమార్చన జరిపించారు.



లక్ష కుంకమార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పంటల సాగులో మెలకువలు పాటించాలి

పాములపాడు: పంటల సాగులో రైతులు తప్పనిసరిగా మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట, బానకచెర్ల గ్రామాల్లో కంది, మినుము, మొక్కజొన్న పైర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశిష్ట సంఖ్య కోసం రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ద్వారా రైతులకందే ప్రతి పథకం వర్తించడానికి అర్హులని వివరించారు. పైర్లలో పలు రకాల తెగుళ్లను గమనించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వాడాల్సిన మందులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గా చరణ్, ఉద్యాన సహాయకులు శ్రీవాణి, గాయత్రీ, వ్యవసాయ సహాయకులు శంషాద్‌బేగం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామం చెంచు గూడెంలో గుండెనొప్పితో మృతి చెందిన చెంచు గిరిజనుడు వెంకటేసు53) అంత్యక్రియలకు బుధవారం ఐటీడీఏ ఏపీఓ నాగార్జున ఆర్థిక సాయం అందజేశారు. ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి శివప్రసాద్ ఆదేశాలతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5000 ఇచ్చామన్నారు.

ప్రజావ్యతిరేక పాలనను తిరస్కరించాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను తిరస్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు రామ్‌నాయక్, వీరన్న, మండల నాయకులు మాబాషా, వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే నిరసనల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు.

భక్తులకు ఏర్పాట్లు చేయాలి

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఎం.రామాంజనేయులు కోరారు. మహానందిలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలు స్నానం చేసే కోనేరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భక్తులరద్దీకి అనుగుణంగా క్యూలైన్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 18న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై రెండో కోఆర్డినేషన్ సమావేశం ఉంటుందని, మహానంది దేవస్థానం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో శివరాత్రి ఏర్పాట్లపై చర్చించారు.



ఆలయ ప్రాంగణంలో సూచనలిస్తున్న డీసీ రామాంజనేయులు